ప్రజావాణిలో 39 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రాంలింగం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో మొత్తం 39 ఫిర్యాదులు వచ్చినట్లు కమిషనర్ రాంలింగం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగానికి సంబంధించి 21 ఫిర్యాదులు, ప్రజాపాలనకు సంబంధించి 12, వక్ఫ్‌బోర్డు, టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు 6 వచ్చినట్లు వెల్లడించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగేంద్రబాబు, డిఈ బాలమురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



శాంతి కమిటీ సమావేశంలో సీఐ రాహుల్‌దేవ్, మైనార్టీ ప్రతినిధులు

అల్వాల్: బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్ కోరారు. రాబోయే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం అల్వాల్ పోలీ స్‌స్టేషన్ ఆవరణలో అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం డివిజన్లకు చెందిన పలువురు మైనార్టీ ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మోసిన్, రషీద్‌ఖాన్, ఫయాజ్, ఆరీఫ్, అహ్మద్, తాజ్, అతీక్ పాషా, షఫీ, అక్రమ్, జావీద్, రహమత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న స్థానికులు

అల్వాల్: అల్వాల్ సర్కిల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో పలువురు వినతిపత్రాలు అందచేశారు. సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంజినీరింగ్, పారుశుద్ధ్య, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. అల్వాల్, వెంకటాపురం, మచ్చబొల్లారం డివిజన్లకు చెందిన కాలనీవాసులు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. అల్వాల్ డిప్యూటీ కమిషనర్ సెలవులో ఉన్నందున సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను ఇన్‌చార్జి డీసీకి అందచేస్తామని అధికారులు తెలిపారు. వర్షాకాలం సమీపించడంతో పలు చోట్ల డ్రైనేజీ, ఓపెన్ నాలాల సమస్య అధికంగా ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నీట్ యూజీ ఫలితాల అవకతవకలపై విచారణ జరిపించాలి



ఈసీఐఎల్ చౌరస్తాలో ఏఐవైఎఫ్ నాయకుల ఆందోళన

కాప్రా: కొందరు అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఎఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. సోమవారం వైద్య కళాశాల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల్లో అవకతవకలు జరిగాయని ఏఐవైఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ చౌరస్తాలో ఆందోళన చేపట్టిన ఏఐవైఎఫ్ నాయకులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సుబోద్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, ఉపాధ్యక్షులు శేఖర్, రమ్య, భవిత, మధురిమ, కీర్తన, భరత్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



కళారత్న డాక్టర్ ఎస్‌పీ.భారతిని సత్కరిస్తున్న కళాకారులు

గౌతంనగర్: శ్రీరాధిక సంగీత నృత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నగరంలోని శ్రీవేంకటేశ్వర భక్త సమాజంలో కర్ణాటక సంగీత, కూచిపూడి నృత్య ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, నాట్య గురువు, కళారత్న డాక్టర్ ఎస్‌పీ.భారతి హాజరై కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కళారత్న డాక్టర్ ఎస్‌పీ.భారతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ చందర్‌రావు, విద్యాన్ శ్రీధరాచార్యులు, నృత్య గురువు రమణిసిద్ధి, విద్యాన్ ఉమా వెంకటేశ్వర్లు, శిర్ని కాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపల్ కార్యాలయంలో ఆరు దరఖాస్తులు

కీసర: నాగారం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలకు సంబంధించి ఆరు దరఖాస్తులను స్వీకరించామని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులే ఫిర్యాదుదారులు

కోడ్ ముగిసినా సమస్యలు పట్టవా?
- ప్రజావాణిలో అధికారులపై ప్రజాప్రతినిధుల గరం..గరం
- కాలనీ ప్రజలతో ప్రజావాణికి హాజరైన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి
- అధికారుల తీరుపై మండిపాటు
- స్పందించపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తాం



మల్కాజిగిరి సర్కిల్ డీసీ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కారణంగా కోడ్ నిబంధనలు ఉండడంతో మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల వద్దకు వెళ్లితే ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నామని చెబుతూ కాలం వెళ్లదీశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం కనిపించలేదు.

మల్కాజిగిరిలో భిన్నమైన పరిస్థితులు ...

మల్కాజిగిరి నియోజకవర్గంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. మల్కాజిగిరి సర్కిలోని ఆరు డివిజన్లలో ముగ్గురు బీజేపీ కార్పొరేటర్లు, ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ఒకరు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అధికారులు సహకరించడం లేదని, కనీసం కొందరు అధికారులు మర్యాదపూర్వకంగా కూడా కలవలేదని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పలు సమస్యలపై ఎమ్మెల్యే చొరవ చూపుతున్నా అధికారులు చొరవ చూపడం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

అధికారుల నిలదీత...

సోమవారం ఎన్నికల తర్వాత తిరిగి మొదలైన ప్రజావాణి కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన డివిజన్లకు సంబంధించిన ప్రజలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో హాజరయ్యారు. పలు సమస్యలపై స్పందింకపోవడంపై సర్కిల్ డీసీ, ఇంజినీరింగ్ విభాగం అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసీ కాలనీలో రోడ్లు బాగాలేదని ఆర్టీసీ బస్సు సర్వీసు కూడా నిలిపివేశారని, పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురైన అధికారుల్లో చలనం లేదన్నారు. రైల్వే అధికారులు వాజుపేయినగర్ ఆర్‌యూబీ వద్ద ఇబ్బందులు తొలగించాలని అడిగితే స్పందించారని, ఇంజనీరింగ్ విభాగం అధికారులు మాత్రం స్పందించలేదన్నారు. కాంట్రాక్టర్లు పనిచేయకపోతే వారిని తొలగించాలని, బ్లాక్ లిస్ట్‌లో చేర్చాలని చెప్పినా పట్టించుకోలేదని, వారికి నోటీసులు జారీ చేయలేదన్నారు. కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని అధికారులను నిలదీశారు. వేరే విభాగం అధికారులతో మాట్లాడి పనులు తీసుకొని వస్తే జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించకపోవడం మంచి పద్ధతి కాదని సూచించారు. ఇదే పరిస్థితి ఉంటే తగిన రీతిలో ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్



ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ సునీతాయాదవ్

బీజేపీ కార్పొరేటర్లు సైతం..

మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పలు సమస్యలను లేవనెత్తారు. నాలాల్లో పూడిక తీయాలని, సఫిల్‌గూడ చెరువులో పూడిక పనులు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిందని ఇప్పటికైనా నిధులు మంజూరైన పనులను ప్రారంభించాలని, నూతన పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతాయాదవ్ మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పలు సమస్యల అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీన్‌దయాళ్‌నగర్, కృష్ణానగర్‌లో ముంపునకు గురికాకుండా చూడాలన్నారు. ఆర్టీసీ కాలనీ ప్రధాన రహదారిని వెంటనే ప్రారంభించాలని, మరమ్మతులతోపాటు పూడికతీత పనులు వేగవంతం చేయాలన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టుతానని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దు



పీర్జాదిగూడ ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్‌లు

మేడిపల్లి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు చేసిన సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి కోరారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమిషనర్ త్రిలేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించి నగర ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు కోరారు. సమారు 32 అర్జీలు అందాయని పలు సమస్యలను తక్షణమే పరిష్కరించడంతోపాటు మిగిలిన వాటిని ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖపరమైన అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అందిన ఫిర్యాదుల్లో ఎక్కువశాతం కరెంటు సమస్యలపైనే- 12 అర్జీలు, వాటర్‌వర్క్ సమస్యలపైన - 10, రోడ్డు సమస్యలపైన- 5 ,పెన్షన్లపైన-2, గ్యాస్ సబ్సిడీపైన-3 అర్జీలు అందాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ జ్యోతి రెడ్డి, ఏఈ బిక్షపతి, టీపీఓ ఆలీపాషా, ఎలక్ట్రికల్ ఏఈ హరినాథ్, వెంకటేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయపాల్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమెన్స్ ఫెలోషిప్ సమావేశం



ఉమెన్స్ ఫెలోషిప్ సమావేశానికి హాజరైన విలియం కేరి

మల్లాపూర్: హోలీ స్పిరిట్ పవర్ వాలంటరీ చర్చిలో సోమవారం మల్లాపూర్ పాస్టర్ మహిళా ఆధ్వర్యంలో సోమవారం ఉమెన్స్ ఫెలోషిప్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యమ్రాన్నికి ముఖ్య అతిథిగా దైవ సేవకురాలు ఆర్. హెబిబా విలియం కేరి హాజరై ఏసుక్రీసు బోధనలు గురించి వివరించారు. అనంతరం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమలలో ప్రముఖ సిస్టర్ వసంత, మల్లాపూర్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రాజు, మల్లాపూర్ పాస్టర్ ఫెలిషిఫ్ కమ్యూనిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన

అల్వాల్: కళా సిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో అల్వాల్ శ్రీసాయి గార్డెన్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కళా సిల్క్ వస్త్ర ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, ఉప్పాడ, బనారస్ సిల్క్, కశ్మీరి సిల్క్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, బెంగాల్ కాటన్ శారీస్, జైపూర్ కుర్తీస్, కోటా శారీస్, లక్నో వర్క్ కుర్తీస్, హర్యానా బెడ్ షీట్స్, హైదరాబాద్ మంచి ముత్యాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు వికాస్ జైన్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ప్రదర్శనలో చీరలను పరిశీలిస్తున్న వినియోగదారులు



అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ఉప్పల్ : వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సూచించారు. ఈ మేరకు సోమవారం వార్డు కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి వర్షాకాలంలో వచ్చే సమస్యలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వరద నీరు నిలిచే ప్రాంతాలు, నాలాల పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విరిగిని విద్యుత్ పోల్స్‌ను తొలగించాలని, తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, జీహెచ్‌ఎంసీ ఎఈ రాజ్‌కుమార్, జలమండలి డిజీఎం రజినికాంత్ రెడ్డి, ఉప్పల్ డిఈ చందన, సానిటరీ సూపరీ వైజర్ రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

ఘట్‌కేసర్: కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కుమార్‌ను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బాలేశ్ తదితరులు సోమవారం కలిశారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. కేంద్ర సహాయ మంత్రి పదవి వచ్చినందుకు అభినందనలు తెలియజేశారు. అలాగే ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేసిన ఈటల రాజేందర్, రఘునందన్‌రావును కలిసి శాలువాతో సత్కరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



శామీర్‌పేట్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని మేడ్చల్ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం అధికారి ఏడీఏ వెంకట్రామ్‌రెడ్డి హెచ్చరించారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని డీలర్లకు సూచించారు. పంటలు పూర్తయ్యే వరకు బిల్లులు, విత్తనాల సంచులను భద్రపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ యాదగిరి, సీడ్ సర్టిఫికేషన్ అధికారి మహేష్, మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్లాటు కబ్జాపై పోలీసులకు ఫిర్యాదు



ప్లాట్‌లో అక్రమంగా జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

మేడిపల్లి: తన భూమిని అక్రమంగా ఆక్రమించటానికి పీర్జాదిగూడ కో ఆప్షన్ మెంబర్ చిలుముల జగదీశ్వర్‌రెడ్డి యత్నించాడని ఉప్పల్‌కు చెందిన బన్నాల ప్రవీణ్, సోలిపురం ముత్యం రెడ్డిలు మేడిపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్ సాయిప్రియ నగర్ (సాలార్‌జంగ్ కంచె) రోడ్డు నెంబర్-1, ప్లాట్ నెంబర్-12లోని 200 గజాల స్థలాన్ని తన స్థలం అంటూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పీర్జాదిగూడ కో ఆప్షన్ మెంబర్ చిలుముల జగదీశ్వర్‌రెడ్డి తన రాజకీయ పలుకుబడి, పార్టీ అండదండలతో తమను బెదిరిస్తూ కొంత మందితో తనపై దాడికి యత్నించారని తెలిపారు. మాకు ఈ స్థలంపై కోర్టు ఆర్డర్ స్టేటస్ (కో) ఉందని చెప్పినా వినకుండా తమకు చెందిన ప్లాట్‌లోని చెట్లు, రాళ్లను జేసీబీతో చదును చేస్తున్నారని వారు పేర్కొన్నారు. సర్వే నంబర్‌లు 5, 8, 9లోని 200 చదరపు గజాల స్థలాన్ని 2004లో కొన్నామని, ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్న అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, అతడి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో యోగా దినోత్సవం



ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో యోగా అభ్యాసం చేయిస్తున్న యోగా శిక్షకులు

ఉప్పల్ : ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా శిక్షకులు కరుణాకర్‌రావు అన్నారు. సోమవారం ఉప్పల్ లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా సాధికారిత యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు కరుణాకర్‌రావు ఉపాధ్యాయులు, విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తూ దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోసఫ్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా ప్రధాన పాత్ర అని ప్రతి నిత్యం యోగాను అభ్యాసం చేయాలని సూచించారు. మానసిక, శారీరక వికాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఒకప్పుడు యోగాపై ఎవరికి అవగాహన ఉండేది కాదని కానీ ఇప్పుడు యోగా విశిష్టతను తెలుసుకొని ప్రపంచస్థాయిలో అధికారులు యోగాను చేస్తున్నారన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



స్కూల్ నూతన భవనాలను ప్రారంభిస్తున్న త్రిపుర గవర్నర్

రామంతాపూర్: సమాజంలో విద్యావంతులు అధిక సంఖ్యలో ఉంటారో అక్కడ సమాజాభివృద్ధితోపాటు దేశం అన్ని రంగాల్లో రాణిస్తుందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం రామంతాపూర్ భరత్‌నగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్ నూతన భవన సముదాయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధునిక భవన సముదాయాన్ని నిర్మించినందుకు ఆయన స్కూల్ అధినేత సూరం రామ్‌రెడ్డిని అభినందించారు. సీబీఎస్ఈ సిలబస్‌ను కూడా ఇవి స్కూల్‌లో ప్రారంభించి అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణితో పాటు స్కూల్ ప్రిన్సిపాల్ మమతారెడ్డి, చుక్కంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు విద్యను అందించడమే లక్ష్యం

ట్రస్ట్ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో దూబగుంట అశోక్



భూమి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: అనాథ పిల్లలకు తప్పనిసరిగా విద్యను అందించాలన్నదే తమ లక్ష్యమని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు, ట్రస్ట్ వ్యవస్థాపకులు దూబగుంట అశోక్ తెలిపారు. సోమవారం శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి సహృదయ మానవతా మాధవ ట్రస్ట్ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నేరెడ్‌మెట్ న్యూ విద్యానగర్‌లో జరిగింది. ఈ పూజా కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దూబగుంట అశోక్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. పిల్లలు భవిష్యత్ చదువుతోనే మారుతుందని అందుకే విద్య అనేది ప్రాథమిక హక్కుగా తాము భావిస్తున్నామన్నారు. ట్రస్ట్ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించటానికి భవనాన్ని పూర్తి చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుగుప్త, కృష్ణకుమార్, శంకర్, బాలరాజు, వెంకటేష్, రాజు, మధు పాల్గొన్నారు.

సేఫ్టీ గ్రిల్స్‌తో ప్రమాదాలకు చెక్

- మ్యాన్‌హోల్స్‌పై మూతలు తీస్తే కఠిన చర్యలు
- సమస్యలపై 15313కు ఫిర్యాదు చేయొచ్చు



భరత్‌నగర్‌లో మ్యాన్‌హోల్ లోపల సేఫ్టీ గ్రిల్స్ అమర్చుతున్న సిబ్బంది

రామంతాపూర్: ప్రతియేటా వర్షాకాలంలో భారీగా కురిసే వర్షాలకు బస్తీలు, కాలనీలోని ప్రధాన రహదారుల్లో వరద నీరు రోడ్లపై నిల్వకుండా ఉండేందుకు కొంతమంది అవగాహనరాహిత్యంతో మ్యాన్‌హోల్స్ మూతలను తెరిచి ఉంచుతున్నారు. దీంతో వర్షాలు కురిసిన సమయాల్లో మ్యాన్‌హోళ్లు పూర్తిగా నిండిపోవటంతో అక్కడ మ్యాన్‌హోల్ ఉన్న సంగతి గుర్తించకపోవటంతో పాదచారులు, వాహనదారులు మ్యాన్‌హోల్స్‌లో పడి గాయాలు కావటంతో పాటు కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం పోతున్నాయి. ఈ ప్రమాదాల నివారణకు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, హబ్సిగూడ, ఉప్పల్, చిలుకానగర్ డివిజన్‌లోని బస్తీల్లో కాలనీలో లోతైన ప్రమాదకరమైన మ్యాన్ హోళ్ళను గుర్తించి వాటి లోపల జలమండలి అధికారులు సేఫ్టీ గ్రిల్స్‌ను ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. మ్యాన్‌హోల్స్‌లో బిగిస్తున్న సేఫ్టీ గ్రిల్స్ వల్ల పొరపాటు ఎవరైనా తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌లో పడితే స్వల్ప గాయాలు తప్ప ఎటువంటి ప్రమాదం జరగదని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. అనధికారింగా జలమండలి అనుమతి లేకుండా మ్యాన్‌హోల్‌పైన ఉండే మూతలను తొలగించడం తెరిచి ఉంచడం వంటి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటున్నారు జలమండలి అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూతలు తెరిచి ఉండటం లేదా మూతలు పక్కన పెట్టి ఉండటం వంటి సంఘటనలకు గమనిస్తే జలమండలి కస్టమర్ కేర్ 15313 నెంబర్‌కు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు.